క్లుప్తంగా

అమ్మకు సరికొత్త కానుక

భద్రాచలంఅర్బన్: మే నెలలో వచ్చే రెండో ఆదివారాన్ని ప్రపంచవ్యాప్తంగా మాతృ దినోత్సవంగా జరుపుకుంటారు. ఆ రోజు తల్లిని గౌరవిస్తూ ప్రేమిస్తూ ఆమెకి పువ్వులు, బహుమతులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, ఈ మదర్స్ డేకి పువ్వులకి బదులుగా ఆమెకు హెచ్‌పీవీ డీఎస్‌ఏ పరీక్ష చేయించి, గర్భాశయ ముఖద్వార కాన్సర్ నుంచి కాపాడాలని అఖిలభారత గైనకాలజిస్టుల ఫెడరేషన్ భద్రాచలం ప్రెసిడెంట్ డాక్టర్ జయభారతి, సెక్రటరీ డాక్టర్ పద్మావతి శనివారం ఓ ప్రకటనలో సూచించారు. 35 సంవత్సరాలు పైబడ్డ స్త్రీలందరూ తప్పని సరిగా ఈ పరీక్ష చేయించుకోవాలని పేర్కొన్నారు. భారతదేశంలో చాలా ఎక్కువగా ఈ వైరస్ వస్తుందని, దీన్ని నివారించడానికి 9 నుండి 14 సంవత్సరాల అమ్మాయిలు, అబ్బాయిలందరికీ రెండు డోసులు వ్యాక్సిన్ ఇవ్వాలని తెలిపారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న పూజారులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రోత్సరణ నడుమ స్వామి కల్యాణ క్రతువు సాగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

డిప్యూటీ సీఎంకు వినతి


వినతి పత్రాన్ని అందిస్తున్న సీపీఎం నాయకులు

అశ్వారావుపేటరూరల్: ప్రజా సమస్యలపై సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యన శనివారం డిప్యూటీ సీఎం, మంత్రి, ఎంపీకు వేర్వేరుగా వినతి పత్రాలను అందించారు. స్థానిక పామాయిల్ ఫ్యాక్టరీ వద్ద జరిగిన సభ తర్వాత స్థానిక సీపీఐ నాయకులు ఎస్‌డి.సలీం, గన్నిన రామకృష్ణతోపాటు పలువురు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణలను కలిసి అశ్వారావుపేటలోని సర్వే నంబర్ 1228లో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి చేశారు. అలాగే సీపీఎం నాయకులు సొడెం ప్రసాద్, చిరంజీవితోపాటు నాయకులు కలిసి వలస ఆదివాసీ గ్రామాల్లో తాగునీటి సమస్య, కన్నాయిగూడెంలోని సర్వే నంబర్ 152, అశ్వారావుపేటలోని సర్వే నంబర్ 911లో అటవీ శాఖ వివాదాన్ని పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందించారు.

పాలు, పండ్లు వితరణ

అశ్వాపురం: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి కోడలు శ్వేత పుట్టిన రోజు సందర్భంగా మండల కేంద్రంలోని అరీఫా-రోష్ని వృద్ధాశ్రమంలో శనివారం కేశవరెడ్డి కుటుంబ సభ్యులు వృద్ధులకు పాలు, పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. రైతులను ప్రోత్సహించేందుకు ఎండాకాలం నుండి ఉపశమనం పొందేందుకు పుచ్చకాయలు వృద్ధులకు అందజేశారు. గాదె లోకేష్‌రెడ్డి, శ్వేత, వృద్ధాశ్రమం నిర్వాహకులు షహనాజ్‌బేగం పాల్గొన్నారు.


బండరాతి కింద ఓ సమాధి


సమాధుల రక్షణకు నిర్మించిన ప్రహరీ


రాకాసి గుండ్లను పరిశీలిస్తున్న పురావస్తు శాఖ అధికారులు (ఫైల్)

పదిలంగా చారిత్రక ఆనవాళ్లు

- పాండురంగాపురంలో పురాతన సమాధులు
- రాకాసి గుండ్లుగా చెలామణి..
- ముందుకు సాగని మ్యూజియం పనులు
- పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే మరింత ప్రాచుర్యం

సండే స్పెషల్


పాండురంగాపురం గ్రామంలోని రాకాసిగుండ్ల ప్రాంతం

పినపాక: మండల కేంద్రంలోని పాండురంగపురం గ్రామం చారిత్రక ఆనవాళ్లకు కేంద్రంగా మారింది. మణుగూరు-ఏటూరు నాగారం ప్రధాన రహదారిలో మండల కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాండురంగపురం గ్రామ సమీపంలోని గుట్టలపై వందల సంఖ్యలో రాకాసి గుండ్లు ఉన్నాయి. వీటిని పురాతన సమాధులుగా పిలుస్తారు.

తరిగిన సమాధులు

గుట్టపై ఉన్న రాకాసి గుల్లకు ఆదరణ కరువైంది. గతంలో వీటిని పలువురు గ్రామస్తులు పగులగొట్టి ఇంటి పునాదిరాళ్లకు వినియోగించారు. చారిత్రక ఆనవాళ్లపై అవగాహన లేని కారణంగా ఇలా చాలావరకు సమాధులు కనుమరుగయ్యాయి. కొన్ని మాత్రం వర్షాలకు ధ్వంసం అయ్యాయి.

కొరవడిన పర్యవేక్షణ

గతంలో ఇక్కడ పర్యటించిన పలువురు పురావస్తు శాఖ అధికారులు పాండురంగాపురం రాకాసి గుండ్లను పరిరక్షించేందుకు సెక్యూరిటీ గార్డును నియమించారు. అదే గ్రామంలో నివాసం ఉంటూ తను రోజుకు రెండుసార్లు వీటిని పరిశీలించేవాడు. తదుపరి కాలంలో అనారోగ్యం కారణంగా స్వగ్రామానికి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఎటువంటి పర్యవేక్షణా లేదు.

ఆ సమాధులు ఎవరివి?

చారిత్రక ఆనవాళ్లు ఉన్న రాకాసి గుండ్ల ప్రాంతాన్ని పురావస్తు శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని పరిశోధనలు ప్రారంభించారు. అందులో భాగంగా ఆ సమాధులు ఆదిమానవులవని గుర్తించారు. అప్పట్లో చనిపోయిన వారిని ఒక రాతి తొట్టిలో ఉంచి మూడు వైపులా రాళ్లతో సమాధిని నిర్మించే వారని చరిత్ర ఆధారంగా నిర్ధారించారు. సమాధుల్లో నిక్షిప్తమైన ఆదిమానవుల జీవన శైలిని తెలుసుకునేందుకు ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో అప్పట్లో ఒక సమాధిని తెరిచి వాటిలో లభించిన అవశేషాలను గుర్తించారు. వాటి ద్వారా వారి ఎత్తు అలంకరణకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.

పురావస్తు శాఖ పరిశోధనలు

దేశవ్యాప్తంగా రాకాసి గుండ్లు అధికంగా ఉన్న పాండురంగపురం గ్రామాన్ని కేంద్ర పురావస్తు శాఖ అధికారులు కొన్నేండ్ల క్రితం సందర్శించారు. అమరావతి శాఖ ఆధ్వర్యంలో రాకాసి గుండ్లను పరిశీలించి, పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని పరిశోధనలు ప్రారంభించారు.

మరుగున మ్యూజియం

పాండురంగాపురం లోని ఈ ప్రాంతంలో పురాతన మ్యూజియంతో పాటు రాకాసి గుల్లకు పార్కును ఏర్పాటు చేసేందుకు పురావస్తు శాఖ గతంలో ప్రణాళికలు సిద్ధం చేసింది. సుమారు 20 కోట్లతో మ్యూజియం, పార్కు, ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రణాళికలు రచించారు. అప్పట్లో అనుమతులు సైతం వచ్చాయి. ఈ క్రమంలో తమిళనాడుకు చెందిన నిర్మాణ సంస్థ 3.5 కోట్లతో ప్రహరీ నిర్మాణ పనులు పొంది నిర్మాణం పూర్తి చేశారు. అనంతరం మ్యూజియం, పార్కు పనులు మరుగున పడ్డాయి. సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికీ వాటిపై ఎటువంటి స్పష్టత లేదు.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

మా గ్రామంలో ఉన్న రాకాసి గోళ్లను ప్రభుత్వం పరిశీలించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. మ్యూజియం, పార్కు అంటే ఏర్పాటు చేస్తే గ్రామం అభివృద్ధి చెందుతుంది.

– వరుణ్, పాండురంగాపురం

అధికారులు చొరవ చూపాలి

పాండురంగాపురం గుట్టలపై ఉన్న రాకాసి గూళ్లను పరిరక్షించేందుకు అధికారులు చొరవ చూపాలి. ప్రభుత్వం ప్రాంతాన్ని సందర్శించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి.

– సమ్మయ్య, అమరారం



రహదారుల దుస్థితి పట్టదా?


కోతకు గురైన మల్లెలమడుగులోని సీసీరోడ్డు


గ్రావెల్ వద్దే ఆగిపోయిన మల్లెలమడుగు-ఆనందాపురం రహదారి

మరమ్మతులకు ఎదురుచూపులు..

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎస్సీ కాలనీ కి వెళ్లే ప్రధాన సీసీ రోడ్డు కోతకు గురై రహదారిపై రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి వెంబడి డ్రెయినేజీ పూడిపోయి వర్షపునీరు, పంట కాలువ నీరు రహదారిపై ప్రవహించడంతో రహదారి కోతకు గురైంది. పెద్ద గుంత పడిపోయింది. రాత్రి సమయంలో రహదారిపై వెళ్లాలంటే స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎంతో కాలంగా రహదారి కోతకు గురైనా ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో కల్వర్టు నిర్మాణానికి ఎంపీపీ శంకుస్థాపన చేసినా పనులు చేపట్టలేదు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి కల్వర్టు, డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రారంభంకాని రోడ్డు

మండల పరిధిలోని ఆనందాపురం నుంచి మల్లెలమడుగు జెడ్పీ స్కూల్ వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభం కావడం లేదు. రహదారి పనులకు గత ఏడాది మార్చి 14న ఎమ్మెల్యే పాయం శంకుస్థాపన చేశారు. రహదారి ఎర్త్ వర్క్ చేసి గ్రావెల్ పోశారు. బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. గ్రావెల్ పోసి నెలలు గడుస్తున్నా బీటీ రోడ్డు పనులు ప్రారంభం కావడం లేదు. రహదారిపై రాకపోకలు సాగిస్తున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రావెల్ పోసి వదిలేయడంతో రహదారిపై ప్రయాణిస్తుంటే దుమ్ము, ధూళితో రైతులు అవస్థలు పడుతున్నారు. రహదారి పనులకు సంబంధించి చేసిన పనులకు బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్ రోడ్డు పనులు చేపట్టడం లేదు.

ఎమ్మెల్యే స్పందించి బీటీ రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు. రహదారి పనులపై ఐటీడీఏ ఏఈ ప్రసాద్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు చేసిన బిల్లులు రాకపోవటంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదని అన్నారు.

పెరుగుతున్న గడ్డిమందు మరణాలు

అశ్వాపురం: చిన్న చిన్న గొడవలకు క్షణికావేశంలో 50 ఏళ్లు కూడా నిండకుండానే ప్రాణాలు తీసుకుంటున్నారు. వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. కొందరు పొలాల్లో గట్లకు భీడు భూముల్లో గడ్డికి స్ప్రే చేసే గడ్డి మందు తాగితున్నారు. ఇలా తాగినవారిలో ఎవరూ బతకడం లేదు. గడ్డి మందు తాగిన 24 నుంచి 72 గంటల్లో ఆ మందు శరీరంలో కిడ్నీ, కాలేయం, ఊపిరితిత్తులకు వ్యాపించి అవి పాడై మృతి చెందుతున్నారు.

కాగా, మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో గడ్డిమందు మరణాలు పెరుగుతున్నాయి. గ్రామంలో వరుస మరణాలతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గత నెలరోజుల వ్యవధిలో గడ్డి మందు తాగి ముగ్గురు మృతి చెందగా మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గతంలోను గడ్డి మందు తాగి పలువురు మృతి చెందారు. ఓ యువకుడు, వృద్ధురాలు ఉరి వేసుకొని మృతి చెందారు. పలువురు అనారోగ్యాలతో మృతి చెందారు. గ్రామంలో వరుస మరణాలు గ్రామస్తులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. మండలంలో పలు గ్రామాల్లో గడ్డి మరణాలు జరుగుతున్నాయి. చిన్న చిన్న సంఘటనలకే క్షణికావేశంలో మృతి చెందటంతో ఆ కుటుంబాలు చిన్నాభిన్నామవడానికి కారణమౌతున్నారు. అధికారులు స్పందించి మల్లెలమడుగు గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గ్రామంలో గడ్డిమందు మరణాలు, ఆత్మహత్యలు జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావ ర్యాలీ



ర్యాలీలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావం తెలుపుతూ మండలంలోని ఎర్రగుంట గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ప్రారంభమైన ర్యాలీ, జాతీయ రహదారిపై నుండి ప్రధాన సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా మానవహారం నిర్వహించి సైన్యానికి మద్దతు తెలిపారు. యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్‌కు నివాళులర్పించారు. జై భారత్ అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్, వేముల రమణ, వేముల నరేష్, ఉపాధ్యాయులు శంకర్‌మహాదేవన్, మీరాసాహెబ్, రాజ్యలక్ష్మి గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతలు స్వీకరణ


వివేక్

బూర్గంపాడు: బూర్గంపాడు మండల తహసీల్దార్‌గా వివేక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ముజాహిద్ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పాల్వంచ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వివేక్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌరసేవలను వేగవంతం చేస్తామన్నారు. మండల పరిధిలోని ప్రజలందరూ అధికారులకు సహకరించాల్సిందిగా ఈ సందర్భంగా ఆయన కోరారు.

జవాన్‌కు ఘన నివాళి


మురళి నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

భద్రాచలంఅర్బన్: దేశ రక్షణ కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన మురళి నాయక్ కుటుంబానికి అండగా నిలవాల్సిన బాధ్యత మనదేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రవికుమార్ అన్నారు. శనివారం సీపీఐ భద్రాచలం పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయంలో అమర వీరుడు మురళి నాయక్ కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రావులపల్లి రవికుమార్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రక్షణలో జవాన్ల సేవలను కొనియాడారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే


ఎమ్మెల్యేను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

దుమ్ముగూడెం: మండలంలోని సీతానగరం గ్రామంలో శ్రీలక్ష్మి, భూలక్ష్మి సమేతం బొడ్రాయి, దుర్గాదేవి, శ్రీముత్యాలమ్మ తల్లి సమేతం శ్రీ పోతు రాజు స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శనివారం పాల్గొని ప్రత్యేక పూజలను చేశారు. గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా చివరి రోజు ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. వేదపండితుల నుండి ఆశీర్వచనం పొందారు. ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువతో సన్మానించారు. గ్రామపెద్దలు,యువత తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి


హమాలీల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకుడు పిట్టల అర్జున్

దమ్మపేట: అసంఘటిత రంగంలో కార్మికులుగా పనిచేస్తున్న హమాలీలకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పిట్టల అర్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం దమ్మపేటలో సీఐటీయూ ఆధ్వర్యంలో హమాలీలతో నిర్వహించిన సమావేశంలో అర్జున్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లు పెట్టుబడిదారులకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. కార్మికులకు అనుకూలంగా లేని లేబర్ కోడులను రద్దుచేసి, వారికి కనీస వేతనంతో పాటుగా వృద్ధాప్యంలో రూ.9వేల పెన్షన్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొప్పుల శ్రీను, సూరి, పుల్లారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా రైల్వేస్టేషన్

- రహదారి నిర్మించినా సదుపాయాలు లేవు..
- ఉపయోగంలోకి రాని అశ్వాపురం రైల్వేస్టేషన్
- హాల్టింగ్, ప్లాట్‌ఫాం నిర్మిస్తే ప్రజలకు రైలు సౌకర్యం


ప్లాట్‌ఫాం లేని అశ్వాపురం రైల్వేస్టేషన్..

అశ్వాపురం: దేశంలోనే అగ్ర స్థానంలో ఉన్న భారజల కర్మాగారం మండలంలో ఉన్నా మండల కేంద్రంలోని అశ్వాపురం రైల్వేస్టేషన్ నిరుపయోగంగా మారింది. రహదారి సౌకర్యం ఉన్నా రైల్వేస్టేషన్‌లో సదుపాయాలు లేవు. దీంతో భారజల కర్మాగారంలోని వివిధ రాష్ట్రాల అధికారులు, ఉద్యోగులు, మండలంలోని 24 గ్రామ పంచాయతీల ప్రజలు మణుగూరు, కొత్తగూడెం వెళ్తూ వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు.

ప్లాట్‌ఫాం లేదు.. రైలు హాల్టింగ్ లేదు..

రైల్వేస్టేషన్ ప్రారంభించిన సమయంలో భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగులు అశ్వాపురం రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించారు. తురుములగూడెం నుంచి రహదారి సౌకర్యం లేక రైల్వే స్టేషన్ వద్ద సిబ్బంది లేక తగిన సౌకర్యాలు లేక లేక రైల్వేస్టేషన్ నిరుపయోగంగా మారింది. గత ఐదేళ్ల క్రితం రైల్వేస్టేషన్‌కు నూతన భవనం నిర్మించారు. స్టేషన్ వద్ద ప్రయాణికులకు ప్లాట్‌ఫాం నిర్మించకపోవడం, మణుగూరు-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్ల హాల్టింగ్ లేకపోవడంతో రైల్వేస్టేషన్ ఉన్నా ప్రజలకు ఉపయోగపడటం లేదు.

నూతన రహదారి నిర్మాణం..

ఎన్నో ఏళ్లుగా అశ్వాపురం రైల్వేస్టేషన్‌కు రహదారి సౌకర్యం లేదు. గత ప్రభుత్వంలో తురుములగూడెం నుంచి రైల్వేస్టేషన్ రహదారికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. రహదారి పనులు ప్రారంభం అయ్యాక పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చొరవతో రహదారి పనులు వేగవంతమయ్యాయి. 3.04 కిలోమీటర్లు రహదారి, సుమారు 15 కల్వర్టులు, సైడ్ బరమ్స్ నిర్మించారు. రైల్వేస్టేషనకు రహదారి కష్టాలు తీరాయి. రైల్వేస్టేషన్ నుంచి గొందిగూడెం వైపు లింక్ రహదారి నిర్మించాల్సి ఉంది. ఈ ప్రాంతం రైల్వే స్టేషన్ పరిధి కావడంతో కేంద్రం అనుమతులు కావాల్సి ఉంది. తురుములగూడెం రహదారి కలుపుతూ గొందిగూడెం లింక్ రోడ్డు నిర్మిస్తే రైల్వేస్టేషన్‌కు ప్రజల రాక సులువుగా ఉంటుంది.

సదుపాయాలు కల్పించాలి..



అశ్వాపురం రైల్వే స్టేషన్ వద్ద మణుగూరు-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్ల హాల్టింగ్ సదుపాయం కల్పించాలి. ప్రయాణికుల సౌకర్యార్థం ప్లాట్‌ఫాం నిర్మించాలి. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ప్రత్యేక చొరవ తీసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– బి.సీతారాములు, భారజల కర్మాగారం ఉద్యోగి

ఉపయోగంలోకి తీసుకురావాలి..



ఎన్నో ఏండ్లుగా రైల్వేస్టేషన్ రహదారి అధ్వానంగా ఉంది. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేక చొరవతో రైల్వేస్టేషన్‌కు రహదారి నిర్మించారు. రైల్వే స్టేషన్ వద్ద రైలు హాల్టింగ్, ప్లాట్‌ఫాం నిర్మించి రైల్వే స్టేషన్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలి.

– గద్దల రామకృష్ణ, అశ్వాపురం

ఇళ్ల మధ్య స్క్రాప్ దుకాణాలు

- అగ్ని ప్రమాదాలకు అవకాశం
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా పట్టించుకోని అధికారులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు


వైఎస్ఆర్ కాలనీలో జనావాసాల మధ్య నిర్వహిస్తున్న స్క్రాప్ దుకాణం..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో తుక్కు దుకాణాల నిర్వహణ తీరు ఆందోళన కలిగిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా జనావాసాల్లో అడ్డగోలుగా ఏర్పాటు చేస్తున్నారు. పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా అధికారులు పట్టీనట్టు వ్యవహరిస్తున్నారు. భద్రాచలంలో పదేళ్ల క్రితం ఒకటో రెండో ఉండే తుక్కు దుకాణాలు.. ప్రస్తుతం దాదాపు 9 వరకు ఏర్పాటయ్యాయి.

ఇరుగుపొరుగుకు ఇబ్బందిగా..

నివాస గృహాల మధ్య కొనసాగుతున్న తుక్కు దుకాణాల వల్ల సమీపంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాత ప్లాస్టిక్ డబ్బాలు, అట్టలు, తుప్పు పట్టిన ఇనుప వస్తువుల్లో వర్షపు నీరు చేరి దోమలకు నిలయంగా మారుతున్నాయి. దుకాణాల్లో పేరుకుపోయిన పాత సామానుల్లో పాములు, విషపు పురుగులు స్థావరాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. అవి పక్కనున్న ఇళ్లలోకి చొరబడుతుండడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. తుప్పు పట్టిన మేకులు, ఇనుప ముక్కలు వాహనాల టైర్లకు గుచ్చుకుని పంక్చర్లు అవుతున్నాయని వాహన చోదకులు చెబుతున్నారు. దీనికితోడు ఇనుప సామానును తుక్కుగా మార్చే క్రమంలో పెద్ద శబ్దాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన వాహనాలను సైతం ఇళ్ల మధ్య ఉన్న తుక్కు దుకాణాల్లోనే తుక్కుగా మార్చుతున్నారు.

పొంచిఉన్న ప్రమాదం


స్క్రాప్ దుకాణాలు లక్షలాది రూపాయల టర్నోవర్‌తో కొనసాగుతున్నాయి. అయితే వీటిని జనావాసాల్లో ఏర్పాటు చేసి.. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను కాలుస్తున్నారు. దీనివల్ల వాయు కాలుష్యానికి కారణమవుతోంది. దీంతోపాటు భారీ అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. అవి చుట్టుపక్కల ఉన్న గృహాలను ఆవరించే అవకాశం ఉంది.

నిబంధనలకు నీళ్లు..

జనావాసాలు, ప్రధాన రహదారుల వెంబడి ఈ దుకాణాలు ఏర్పాటు చేయకూడదు. చిరు వ్యాపారులు సేకరించిన ఇనుము, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను బడా వ్యాపారులు గొడౌన్లలో నిల్వ చేస్తున్నారు. నిల్వ చేసిన వ్యర్థాలను లారీలు, వ్యాన్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇలా రవాణా చేసే వాటికి నిబంధనల ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కానీ తుక్కు వ్యాపారులు పన్ను చెల్లింపును ఎగ్గొడుతున్నారు. అయినా అధికారులెవరూ తనిఖీ చేసిన దాఖలాలు లేవు. తుక్కు దుకాణాల్లో అగ్ని ప్రమా దాలు సంభవిస్తే సమీపంలో నివాస గృహాలకు ఇబ్బందులు తప్పవు.

తొలుత జీవనోపాధికి ఏర్పాటు చేస్తున్న తుక్కు దుకాణాలు క్రమేపీ వ్యాపార సామ్రాజ్యంగా విస్తరిస్తున్నాయి. అధికారులు స్పందించి నివాస గృహాలకు సమీపంలో ఉన్న తుక్కు దుకాణాలు, గోదాములను జన సంచారం లేని ప్రాంతాలకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..



స్క్రాప్ దుకాణాలకు నిర్వహణకు సంబంధించి ఎలాంటి నిబంధనలు పెట్టలేదు. పట్టణ పరిధిలో స్క్రాప్ దుకాణాల నిర్వహణ తీరుపై దృష్టి పెడతాం. అవసరమైతే వాటిని పరిశీలిస్తాం, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుం టాం. నివాస గృహాల సమీపంలో స్క్రాప్ దుకాణాల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత వ్యాపారులదే. ఆయా ప్రాంతాల ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే తీవ్రంగా పరిగణిస్తాం. స్క్రాప్ దుకాణాల వద్ద అగ్ని నిరోధక పరి కరాలు అందుబాటులో ఉండాలి.

– శ్రీనివాస్, గ్రామ పంచాయతీ అధికారి, భద్రాచలం